

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 259 | పేజీలు : 8 | వెల : రూ.2/- | మంగళవారం 13 అక్టోబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

తిరుపతి పవిత్రత విషయంలో

రాజీ పడేది లేదు

రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం:చంద్రబాబు



తిరుపతి,మన జనప్రగతి అక్టోబర్ 12: ఆధ్యాత్మికత, ఆధునిక సాంకేతికత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ తిరుపతి, తిరుమల ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. తిరుపతి పవిత్రతను కాపాడే విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. తిరుపతి అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులకు సోమవారం అమరావతి నుంచి దృశ్యమాధ్యమం ద్వారా శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ నిధులతో చేపట్టనున్న ఈ పనుల అంచనా వ్యయం రూ.3,222 కోట్లు.నగరాన్ని జాతీయ రహదారులతో అనుసంధానించేలా రహదారుల మిగతా2లో...



ఆరు రాష్ట్రాలకు

కొత్త గవర్నర్లు

నలుగురికి తొలిసారి అవకాశం.. ఇద్దరు గవర్నర్ల బదిలీ

నియామకాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం

న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 12: దేశంలోని ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కీలక నిర్ణయం తీసుకున్నారు. కేరళ, తమిళనాడు, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్, సిక్కిం రాష్ట్రాలకు సంబంధించి కొత్త నియామకాలు, బదిలీలు చేపట్టారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కొత్త గవర్నర్లు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఈ నియామకాలు అమల్లోకి రానున్నాయి.**ఆరుగురు గవర్నర్ల వివరాలు** సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మిగతా2లో...

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్

స్వర్గధామం

● రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి ● డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ● రూ.6,347 కోట్ల పెట్టుబడులు.. 18 వేల మందికి ఉపాధి అవకాశాలు



దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి

భారీ ప్రణాళిక



ఏపీలో 17 నగరపాలక సంస్థల మేయర్ పదవులకు

రిజర్వేషన్లు ఖరారు

- ఎస్టీలకు ఒకటి.. ఎస్సీలకు రెండు.. బీసీలకు ఐదు పదవులు



అమరావతి,మన జనప్రగతి అక్టోబర్ 12: ఆంధ్రప్రదేశ్‌లో 17 నగరపాలక సంస్థల మేయర్ పదవులకు రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లను ఖరారు చేసింది. ఈ మేరకు పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ జీవో నంబర్ 252ను జారీ చేసింది. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మొత్తం 17 మేయర్ పదవుల్లో ఐదింటిని మిగతా2లో...



విజయవాడ బైపాస్‌లో ఘోర ప్రమాదం.. నలుగురు సజీవ దహనం

మరో వ్యక్తికి తీవ్ర గాయాలు.. మృతుల్లో చిన్నారి

విజయవాడ,మన జనప్రగతి అక్టోబర్ 12: విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారిపై సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న విద్యుత్తు కారు రహదారి పక్కన ఉన్న రెయిలింగ్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సజీవ దహనమయ్యారు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు.పోలీసుల వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా నంబూరులో జరిగిన కుటుంబ వేడుకకు హాజరై తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు వ్యాపించడంతో అందులో మిగతా2లో...

సీ-ఈసీపై జనాగ్రహం..

ఢిల్లీలో ఇండియా కూటమి భారీ ప్రదర్శన

ఓటు హక్కుల పరిరక్షణకు నినాదాలు.. జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 12: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి నేతలు సోమవారం ఢిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై నిరసన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాలని, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టు వైపు ర్యాలీగా బయలుదేరారు.లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తెలంగాణ మిగతా2లో...

సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

- సీజేఐ సూర్యకాంత్



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 12: సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనల కారణంగా న్యాయస్థాన కార్యకలాపాలకు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కక్షిదారుల రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకూడదని సూచించారు. ప్రజాస్వామ్యంలో నిరసనలు తెలిపే హక్కు ఉన్నప్పటికీ, మిగతా2లో...

ఎల్‌నినోపై ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణ ఏదీ?

రైతులు, కూలీలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలి: హరీశ్‌రావు



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 12: ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక రూపొందించాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీటి కొరత, విద్యుత్ సమస్యలతో రైతులు మిగతా2లో...

తిరుపతి పవిత్రత విషయంలో రాజీ పడేది లేదు

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ఐతేపల్లి, రంగంపేట ప్రాంతాలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా బెంగళూరుతిరుపతి, తిరుపతిమదనపల్లె జాతీయ రహదారులను అనుసంధానించవచ్చని పేర్కొన్నారు. చంద్రగిరి మండలం ఐతేపల్లి నుంచి శ్రీసిటీ వరకు కొత్త రహదారి నిర్మాణం చేపడితే మారుమూల ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. తిరుపతి చుట్టూ రహదారి అనుసంధానాన్ని మెరుగుపరిచే ప్రతిపాదనలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.నగరంలోని చెరువులను అభివృద్ధి చేసి, సుందరీకరించాలని చంద్రబాబు సూచించారు. చెరువుల చుట్టూ నడక మార్గాలు ఏర్పాటు చేయడంతోపాటు, తెల్లవారుజామున వాటి పరిసరాల్లో వెంకటేశ్వర సుప్రభాతం వినిపించేలా ఏర్పాట్లు చేయాలని అన్నారు. తిరుపతిని పరిశుభ్రమైన, పచ్చదనంతో నిండిన నగరంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ ఏడాదిలోనే కళ్యాణి జలాశయానికి హంద్రీనీవా జలాలను తీసుకురావాలని, మరో రెండు మూడు సంవత్సరాల్లో తిరుపతికి కూడా ఆ నీటిని అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.తిరుపతి అభివృద్ధిలో తిరుమల తిరుపతి దేవస్థానానికి కీలక బాధ్యత ఉందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దేవస్థానం నుంచి నగరపాలక సంస్థకు పన్నుల రూపంలో నిధులు అందితే నగరాభివృద్ధి పనులకు మరింత తోడ్పాటు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని ఎస్వీ జంతుప్రదర్శనశాలను కూడా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.శెట్టిపల్లెలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల వినియోగంపైనా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. అక్కడి భూముల్లో 15 నుంచి 20 ఎకరాలను రిలయన్స్ వంతారాకు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. ఈ స్థలంలో హోటల్‌తో పాటు సమావేశాల కేంద్రం ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందని తెలిపారు. మిగిలిన భూములను సమాచార సాంకేతిక రంగానికి కేటాయించి, సాంకేతిక పార్కులు, హోటళ్లు, క్రీడా సదుపాయాలు అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచాలని సూచించారు.అలిపిరి సమీపంలో రూ.2,700 కోట్ల అంచనా వ్యయంతో సమగ్ర పర్యాటక పట్టణం నిర్మాణానికి, వడమాలపేట మండలం పాదిరేడు అరణ్యం గ్రామం వద్ద 418 ఎకరాల్లో రూ.230 కోట్లతో 5,192 మంది తిరుమల తిరుపతి దేవస్థానం ఉద్యోగులకు ఇంటి స్థలాల అభివృద్ధికి, తిరుపతిలో రూ.242 కోట్ల అంచనా వ్యయంతో తొమ్మిది ప్రధాన రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి, పి.నారాయణ, దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు బీఆర్ నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామం

కాకినాడ మన జనప్రగతి అక్టోబరు 12: ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా తీర్చిదిద్దుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. పారిశ్రామికవేత్తలు లాభాలతోపాటు దేశాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని కోరారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ప్రోత్సాహకాలను వేగంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాకినాడ జేఎన్‌టీయూలో సోమవారం నిర్వహించిన భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రాంతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల ఏర్పాటుకు ఇబ్బందులు ఉండేవని పవన్ కల్యాణ్ విమర్శించారు. ప్రస్తుతం పెట్టుబడిదారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడంతోపాటు ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. **రూ.6,347 కోట్ల పెట్టుబడులతో కొత్త అవకాశాలు**కాకినాడలో నిర్వహించిన సీఐఐ ప్రాంతీయ సదస్సులో 16 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులకు



సంబంధించిన కార్యక్రమాలతోపాటు, రూ.2,090 కోట్లతో నాలుగు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు జరిగినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటి ద్వారా సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ పెట్టుబడులు కాకినాడ, పరిసర ప్రాంతాల పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. **714 ప్రాజెక్టుల ద్వారా రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు** 2024 జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల ప్రాజెక్టులకు అనుమతులు పూర్తయ్యాయని, రూ.4.7 లక్షల కోట్ల ప్రాజెక్టులు కార్యరూపంలోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 7.1 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని వివరించారు. పరిశ్రమలు వాస్తవంగా ప్రారంభమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. **పర్యావరణ పరిరక్షణతో సమగ్ర అభివృద్ధి**కాకినాడలో నౌకా నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్, ఆహార శుద్ధి, ఆక్వా పరిశ్రమలకు అవకాశాలు ఉన్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని పారిశ్రామికవేత్తలను కోరారు. రాష్ట్ర తీర ప్రాంత పరిరక్షణతోపాటు పచ్చదనం పెంపునకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా పర్యావరణహిత పారిశ్రామిక విధానాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం వెంకటేశ్వరరావు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టును రాజకీయ వివాదాల్లోకి లాగొద్దు

(మొదటి పేజీ తరువాయి)

వాటి వల్ల న్యాయస్థానాల విధులకు అంతరాయం కలగకూడదని పేర్కొన్నారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబర్ 10న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా న్యాయవాదులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా న్యాయవాదులు ఎదుర్కొన్న ఇబ్బందులను సీనియర్ న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు ఎవరికీ అభ్యంతరం లేదని, అయితే కోర్టు కార్యకలాపాలకు ఆటంకం కలిగించరాదని స్పష్టం చేశారు. న్యాయవాదులు, సిబ్బంది, కక్షిదారుల స్వేచ్ఛాయుత రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు ఉండకూడదని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లను తదుపరి విచారణ కోసం ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది.

భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమవుతున్నాయి: కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ,మన జనప్రగతి అక్టోబర్ 12: కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ, ప్రజాస్వామ్య సంస్థలను లక్ష్యంగా చేసుకుంటోందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ చేతులు కలుపు తున్నాయని, దేశభక్తులంతా ఏకమవుతారని వ్యాఖ్యానించారు.భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ రాజీనామా చేయాలంటూ కేరళ కాంగ్రెస్ సామాజిక మాధ్యమంలో చేసిన వ్యాఖ్యలపై రిజిజు స్పందించారు. ఢిల్లీలో ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతలు తన పరిధిలోని అంశం కాదని ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కేరళ కాంగ్రెస్ ఆయన రాజీనామాను డిమాండ్ చేసింది. అనంతరం ఆ పోస్టును తొలగించింది.ఈ పరిణామంపై రిజిజు తీవ్రంగా స్పందిస్తూ, ఎన్నికల సంఘం తర్వాత కాంగ్రెస్ తదుపరి లక్ష్యం న్యాయవ్యవస్థేనని తాను గతంలోనే చెప్పానన్నారు. దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలు, ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలతో కాంగ్రెస్, భాజపా మధ్య రాజకీయ విమర్శలు మరింత వేడెక్కాయి.

ఎల్‌నినోపై ప్రభుత్వానికి స్పష్టమైన కార్యాచరణ ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. యాసంగి పంటలు వేయవద్దని సూచిస్తే రైతులు, వ్యవసాయ కూలీల జీవనోపాధికి భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఉపాధి లేక ప్రజలు మళ్లీ వలసలు వెళ్లే పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యుత్ సరఫరా, సాగునీటి సమస్యలను పరిష్కరించడంతో పాటు రైతులకు అందాల్సిన పథకాలపై స్పష్టత ఇవ్వాలని హరీశ్‌రావు కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ రంగానికి నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, రైతులు, కూలీలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

41 బార్ల అనుమతుల కోసం 2,200 దరఖాస్తులు



హైదరాబాద్,మన జనప్రగతి అక్టోబర్ 12: తెలంగాణలో కొత్త బార్ల ఏర్పాటు కోసం భారీగా దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ఆబ్కారీ శాఖ జారీ చేసిన ప్రకటన ప్రకారం 41 బార్ల అనుమతుల కోసం సుమారు 2,200 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల స్వీకరణకు సోమవారం చివరి రోజు కావడంతో సంబంధిత కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.మొత్తం 41 బార్లలో 14 హైదరాబాద్ నగర ప్రధాన ప్రాంతంలో ఉండగా, మిగిలిన 27 బార్లను ఇతర నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల పరిధిలో ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగేందుకు ఆబ్కారీ కమిషనర్ కార్యాలయంతో పాటు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పరిధిలోని సంబంధిత కార్యాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఒక్కో దరఖాస్తుకు రూ.లక్ష రుసుముగా నిర్ణయించారు. కొత్త బార్ల ఏర్పాటుకు ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు రావడంతో అనుమతుల కేటాయింపుపై ఆసక్తి నెలకొంది. తదుపరి దశలో దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల ప్రకారం అర్హులకు అనుమతులు కేటాయించేందుకు అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

(మొదటి పేజీ తరువాయి)

మాథుర్‌ను కేరళ గవర్నర్‌గా నియమించారు. కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌కు తమిళనాడు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక ఒడిశా గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్, కర్ణాటక గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్, ఉత్తరాఖండ్ గవర్నర్‌గా డాక్టర్ ధాల్ సింగ్ బిసేన్, సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్‌ను నియమించారు. **నలుగురికి కొత్త బాధ్యతలు** ఈ నియామకాల్లో భాగంగా బ్రిజ్ మోహన్ రామ్, సుధా యాదవ్, ధాల్ సింగ్ బిసేన్, దుష్యంత్ గౌతమ్‌లకు కొత్తగా గవర్నర్ బాధ్యతలు అప్పగించారు. మరోవైపు ఓం ప్రకాశ్ మాథుర్, రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌లను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేశారు. ఆయా రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన బాధ్యతలను నిర్వహించేందుకు ఈ నియామకాలు చేపట్టినట్లు రాష్ట్రపతి భవన్ ప్రకటనలో పేర్కొంది.దేశంలోని ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల మార్పులతో ఆయా రాష్ట్రాల రాజ్యాంగపరమైన వ్యవహారాల్లో కొత్త నియామకాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొత్త గవర్నర్లు బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారికంగా తమ విధులను ప్రారంభించనున్నారు.

దేశవ్యాప్తంగా 5 వేల ఆలయాల నిర్మాణానికి భారీ ప్రణాళిక

అమరావతి: మన జనప్రగతి అక్టోబరు 12:దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత విస్తరించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణాన్ని ప్రోత్సహించే దిశగా 5 వేల ఆలయాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఈ లక్ష్యాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాలు నివసించే ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆలయాల నిర్మాణానికి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించి, అర్హమైన ప్రాంతాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన ఆవాసాలు, మత్స్యకారుల నివాస ప్రాంతాలు, బలహీన వర్గాల కాలనీల్లో ఆలయాలు నిర్మించడం ద్వారా స్థానిక ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజల అవసరాలు, అందుబాటులో ఉన్న స్థలాలు, నిర్మాణానికి అవసరమైన సదుపాయాలను పరిగణనలోకి తీసుకుని పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమానికి సంబంధించి 28 జిల్లాల్లోని 161 నియోజకవర్గాల నుంచి మొత్తం 4,192 ఆలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు అందినట్లు అధికారులు వెల్లడించారు. వాటిలో 967 ఆలయాల నిర్మాణం ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ఆలయాల నిర్మాణానికి అవసరమైన స్థలాల గుర్తింపు, అనుమతులు, నిధుల కేటాయింపు, నిర్మాణ పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని నిర్ణయించారు.ఆలయాల నిర్మాణం కేవలం భవనాల ఏర్పాటుకే పరిమితం కాకుండా, స్థానిక ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీర్చేలా ఉండాలని అధికారులు భావిస్తున్నారు. నిర్మాణాల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు, అందుబాటులో ఉన్న నిధులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.ఈ లక్ష్యాన్ని 2028 నాటికి పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించినట్లు సమాచారం. ఆలయాల నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే పూర్తయిన పనులు, కొనసాగుతున్న పనులు, ఇంకా ప్రారంభం కావాల్సిన పనుల వివరాలను సేకరించి తదుపరి కార్యాచరణ సిద్ధం చేయనున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం నెరవేరితే వివిధ ప్రాంతాల్లోని ప్రజలకు స్థానికంగానే ఆలయాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

ఏపీలో 17 నగరపాలక సంస్థల మేయర్ పదవులకు రిజర్వేషన్లు ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

వెనుకబడిన తరగతులకు, రెండింటిని షెడ్యూల్డ్ కులాలకు, ఒకదాన్ని షెడ్యూల్డ్ తెగలకు కేటాయించారు. మరో ఐదు పదవులను సాధారణ మహిళలకు రిజర్వ్ చేయగా, నాలుగు పదవులను రిజర్వేషన్లు లేనివిగా ప్రకటించారు.ప్రభుత్వం ప్రకటించిన వివరాల ప్రకారం మంగళగిరితాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ పదవిని షెడ్యూల్డ్ తెగల సాధారణ విభాగానికి కేటాయించారు. కర్నూలు మేయర్ పదవిని షెడ్యూల్డ్ కులాల మహిళకు రిజర్వ్ చేశారు. రాజమహేంద్రవరం మేయర్ పదవిని షెడ్యూల్డ్ కులాల సాధారణ విభాగానికి కేటాయించారు. కాకినాడ, మచిలీపట్నం మేయర్ పదవులను వెనుకబడిన తరగతుల మహిళలకు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఏలూరు, అనంతపురం, చిత్తూరు నగరపాలక సంస్థల మేయర్ పదవులను వెనుకబడిన తరగతుల సాధారణ విభాగానికి కేటాయించారు. విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప నగరపాలక సంస్థలతో పాటు విశాఖపట్నం మహానగర పాలక సంస్థ మేయర్ పదవులను సాధారణ మహిళలకు రిజర్వ్ చేశారు. దీంతో ఆయా నగరాల్లో మహిళా నాయకత్వానికి అవకాశం లభించనుంది. మరోవైపు తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు నగరపాలక సంస్థల మేయర్ పదవులను రిజర్వేషన్లు లేనివిగా ప్రకటించారు. ఈ పదవులకు పోటీ చేసే అభ్యర్థుల విషయంలో రిజర్వేషన్ వర్గ పరిమితి ఉండదు. అయితే ఎన్నికల నిబంధనలు, ఇతర అర్హతలు వర్తిస్తాయి. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.మేయర్ పదవుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఆయా నగరాల్లో రాజకీయ పార్టీల్లో ఎన్నికల చర్చలు ఊపందుకునే అవకాశం ఉంది. ఏ సామాజిక వర్గానికి ఏ నగరంలో అవకాశం లభించిందన్న అంశంపై ఆశావహులు, స్థానిక నాయకులు దృష్టి సారిస్తున్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థుల ఎంపిక, స్థానిక రాజకీయ సమీకరణాలు మారే అవకాశముంది. ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగుతున్న కొద్దీ ఆయా నగరాల్లో రాజకీయ పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది.

సీ-ఈసీపై జనాగ్రహం..

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు ప్రతిపక్ష నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పోలీసులు భారీగా మోహరించి ర్యాలీని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. సుప్రీంకోర్టుకు సమీపంలో నిరసనకారులను పోలీసులు నిలువరించారు. ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై సమాధానం చెప్పాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని ప్రతిపక్ష నేతలు స్పష్టం చేశారు.

విజయవాడ బైపాస్‌లో ఘోర ప్రమాదం.. నలుగురు సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

ఉన్నవారు బయటకు వచ్చేందుకు అవకాశం లేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.ఈ ప్రమాదంలో రాందేవ్, అరుణ, విజయతో పాటు ఓ చిన్నారి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.ప్రమాద ఘటనపై మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వ్యక్తికి మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 12:ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యతతో కూడిన పరిష్కారాలను అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి, వాటి పరిష్కారంపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం ప్రభుత్వ యంత్రాంగం ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా అందుతున్న ప్రతి అర్జీని అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్ణీత గడువులోగా సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారంలో జాప్యం ఉండకూడదని పేర్కొన్నారు. పిటిషనర్లకు అందించే ఎండార్స్‌మెంట్‌లు స్పష్టంగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారి పిటిషనర్ తో స్వయంగా మాట్లాడాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి, వాస్తవ పరిస్థితులను తెలుసుకొని సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌లో నమోదవుతున్న “రీ ఓపెన్”, “ఇంప్రాపర్ రెడ్రెసల్” కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, రామసుబ్బయ్య, శివ ప్రసాద్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఐలకు ఘనంగా సన్మానం

- బదిలీపై వెళ్తున్న ఏ.జయన్న,నూతన సీఐ జీ.వి.నాగరాజురావుకు సత్కారం



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 12:-పత్తికొండ అర్బన్ సీఐగా సేవలందించి బదిలీపై వెళ్తున్న ఏ.జయన్నకు, నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీ.వి.నాగరాజురావుకు ఘనంగా సన్మానం నిర్వహించారు. సోమవారం పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఇరువురు సీఐలకు పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. బదిలీపై వెళ్తున్న ఏ.జయన్నకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జీ.వి.నాగరాజురావుకు అభినందనలు తెలియజేస్తూ, పత్తికొండలో శాంతిభద్రతల పరిరక్షణకు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రఘుశేఖర్, శీను, రామలింగ, రామంజి, సూరేంద్ర, నాగరాజుతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పసుపు కుంకుమగా ఇచ్చిన భూమి కోసం పోరాటం

- భూ వివాదంపై అధికారులకు బాధితురాలి విజ్ఞప్తి
- న్యాయం కోసం ఎదురుచూపులు



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 12:-అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం గోరాన్‌చెరువు గ్రామంలో భూ వివాదం వెలుగులోకి వచ్చింది. సర్వే నంబర్ 2లో ఉన్న రెండు ఎకరాల 40 సెంట్ల భూమి విషయంలో తన తమ్ముడు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని గాజుల ప్రభావతమ్మ ఆరోపించారు. తన వివాహ సమయంలో పసుపు కుంకుమ కింద ఈ భూమిని ఇచ్చారని ఆమె తెలిపారు.తనకు చెందిన భూమిలోకి రావద్దని అడ్డుకుంటున్నప్పటికీ, తనపై దాడికి పాల్పడుతున్నారని ప్రభావతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. పసుపు కుంకుమ కింద తనకు వచ్చిన భూమిపై హక్కులు కాపాడుకునేందుకు పోరాడుతున్నానని పేర్కొన్నారు.ఈ భూ వివాదంపై సంబంధిత అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని ఆమె కోరారు. తనకు న్యాయం జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గాజుల ప్రభావతమ్మ విజ్ఞప్తి చేశారు.

డేటా విశ్లేషణపై ఆరు రోజుల కార్యశాల పోస్టర్ విడుదల



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 12:- యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో “సామాజిక శాస్త్ర పరిశోధనలో బహుచర డేటా విశ్లేషణ” అంశంపై ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు ఆరు రోజుల కార్యశాల నిర్వహించనున్నట్లు ఉపకుల పతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ తెలిపారు. సోమవారం తన ఛాంబర్‌లో కార్యశాల పోస్టర్లను విడుదల చేశారు.ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్), హైదరాబాద్ ఆర్థిక సహకారంతో నిర్వహించే ఈ కార్యశాలలో పరిశోధకులు, పీజీ విద్యార్థులు, అధ్యాపకులకు వివిధ డేటా విశ్లేషణ పద్ధతులపై ప్రాయోగిక శిక్షణ అందించనున్నారు. పరిశోధనా నైపుణ్యాలు, గణాంక విశ్లేషణ సామర్థ్యాలను పెంపొందించడం కార్యశాల ప్రధాన లక్ష్యం.మొదట నమోదు చేసుకున్న 40 మందికి రిజిస్ట్రేషన్ ఉచితం. బయటి ప్రాంతాల నుంచి వచ్చే పాల్గొనేవారికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పించనున్నారు. ప్రాయోగిక శిక్షణ కోసం పాల్గొనేవారు తమ ల్యాప్‌టాప్‌లను తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఏజీ దాము, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్‌సీ గంగిరెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ లక్ష్మీప్రసాద్, కార్యశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వై. సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తొలగించాలి.. ప్రమాదాలను నివారించాలి.!

ప్రధాన రహదారిపై డ్రైనేజీ కాలువల ఆక్రమణలతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన యువ స్పందన సభ్యులు



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 12:-పత్తికొండ పట్టణంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాలువలపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని యువ స్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి నాగరాజు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో చిన్న ఓబులేసుకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్ కేంద్రంగా ఉన్న పత్తికొండకు ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి ప్రజలు వివిధ పనుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి గుత్తి సర్కిల్, చక్రాల రోడ్డు, కొత్త బస్టాండ్ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు.దుకాణాల ముందు, ఇళ్ల సమీపంలో షెడ్లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవడంతోపాటు మరికొందరు గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కట్టడాలు, వాహనాల రద్దీతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య కూడా తీవ్రమవుతోందన్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను పరిశీలించి, నిబంధనల ప్రకారం తొలగించాలని కోరారు. తద్వారా ట్రాఫిక్ సమస్యలను తగ్గించి, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యువ స్పందన సొసైటీ సభ్యులు రమేష్, రాజశేఖర్, సుధా, బాలు, ధను, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ఇళ్ల నిర్మాణాలను గ్రౌండింగ్ చేయాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.



కర్నూలు బ్యూరో మన జనప్రగతి అక్టోబర్ 12:జిల్లాలో గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను అక్టోబర్ 30వ తేదీ లోగా గ్రౌండింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి హౌసింగ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి గృహ నిర్మాణం, టిడ్కో హౌసింగ్, వాట్సాప్ గవర్నెన్స్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇంటిని అందించాలనే లక్ష్యంతో గృహ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోవడానికి గల కారణాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కొరత, రుణ సదుపాయాలపై అవగాహన లేకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ పథకం అమలులో పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వయం సహాయక సంఘాల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు లభించే రుణ సదుపాయాలపై విస్తృతంగా ప్రచారం చేసి, ఇళ్ల నిర్మాణాలకు వారిని ప్రోత్సహించాలన్నారు. పి ఎం ఏ వై అర్బన్-1, అర్బన్-2 పథకాల పురోగతిని మరింత మెరుగుపరచడంతో పాటు గ్రామీణ గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.సమావేశంలో డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి నరసింహా రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీత, ఐసిడిఎస్ పిడి విజయ, డి ఆర్ డి ఏ పిడి శ్రీధర్ రావు, జిల్లా స్వర్ణ వార్డు స్వర్ణ గ్రామ అధికారి భాస్కర్ నాయుడు, సిపిఓ భారతి, ఉపాధి కల్పన అధికారి దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

పత్తి సాగులో ఎరువుల వినియోగంపై అవగాహన అవసరం

మండల వ్యవసాయ అధికారి జి.పి.ఓబులేసు సూచన

అధిక యూరియా వాడకంతో చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం




వేముల మన జనప్రగతి అక్టోబర్ 12:-పత్తి సాగులో అధిక దిగుబడి సాధించాలంటే ఎరువులను సరైన మోతాదులో వినియోగిస్తూ, శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయ అధికారి జి.పి.ఓబులేసు రైతులకు సూచించారు. వేముల మండల పరిధిలోని స్థానిక చాగలేరు గ్రామంలో సోమవారం ఉదయం “కపాస్ కాంతి పథకం“ లో భాగంగా నిర్వహించిన రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని పత్తి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువుల వినియోగం, సూక్ష్మపోషకాల ప్రాధాన్యతను వివరించారు.పత్తి పంటకు అవసరమైన పోషకాలను సమతుల్యంగా అందించేందుకు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని ఓబులేసు సూచించారు. నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలను పంట అవసరాలకు అనుగుణంగా అందించాలన్నారు. అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల మొక్కలు ఏపుగా పెరిగి చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అందువల్ల వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులను వినియోగించాలని స్పష్టం చేశారు.పత్తి మొక్కల్లో సూక్ష్మపోషకాల లోపాలను ఎప్పటికప్పుడు గుర్తించి, అవసరమైన పోషకాలను సకాలంలో అందించాలని తెలిపారు. ముఖ్యంగా మెగ్నీషియం లోపం కారణంగా ఆకుల ఈనెల మధ్య పసుపు రంగు కనిపించే లక్షణాలను గమనించి, వ్యవసాయ అధికారుల సలహా మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు పంట ఎదుగుదలను నిరంతరం పరిశీలిస్తూ శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని ఓబులేసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణి దేవిగా దుర్గమ్మ దర్శనం



- మాజీ జెడ్పిటిసి రవిరెడ్డి చేత దాతలకు సత్కారం



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 12:-స్థానిక సాయినగర్ లో వెలసిన శ్రీదుర్గాదేవి ఆలయంలో ని అమ్మవారు బ్రహ్మచారిణి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు ఆలయ అర్చకుడు శాకల్య విష్ణుశర్మ నేతృత్వంలో దుర్గమ్మకు పంచామృత అభిషేకం, నివేదన, మంత్రపుష్పం, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మచారిణి దేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మొదటిరోజు వేంపల్లి తాజా మాజీ సర్పంచ్ ఆర్.శీను, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్. వేణు, రెండో రోజైన సోమవారం కొత్తూరు రత్నాలు,కొత్తూరు బొంగుల రామయ్య దంపతులు తాత్కాలిక ఉభయదారులుగా వ్యవహరిం చారు. వీరిని ఆలయ వ్యవస్థాపకుడు జడ్పిటిసి మాజీ సభ్యుడు మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి దుశ్శాలువతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేసి వేద మంత్రోచ్చారణతో ఆశీర్వదించారు. అలాగే భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. 9 రోజల పాటు శ్రీచక్రార్చన, సహస్రనామార్చన, కలశపూజ, జపహోమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు వివరించారు. ఈనెల 20న మధ్యాహ్నం శమీ దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు అంగరంగ వైభవంగా మంగళ వాయిద్యాల నడుమ బాణసం చాలతో దుర్గమ్మ తల్లి గ్రామోత్సవాన్ని ఏర్పాటు చేశామ న్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దుర్గమ్మను దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

న్యూ సెంచురీ స్కూల్లో ఆకట్టుకున్న దేవీ నవరాత్రుల వేషధారణ



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 12:-స్థానిక న్యూ సెంచురీ స్కూల్ ఆవరణలో సోమవారం దేవీ నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని స్కూలు విద్యార్థిని విద్యార్థులు చే నవరాత్రి ఒక్క ప్రాధాన్యతను తెలియజేస్తూ విద్యార్థి లు మహిషాసుర మర్దిని, అలాగే బాలా త్రిపుర సుందరి, లలితా దేవి, వంటి వివిధ వేష దారుణాలు ప్రదర్శిస్తూ నవరాత్రిలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా నాటకాలు ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొని తమ పిల్లలు చేసిన నాటకం చూసి భక్తితో ముగ్ధులయ్యారు ఈ కార్యక్రమాన్ని స్కూల్ యాజమాన్యం తమ స్కూలు ప్రాంగణంలోనే నిర్వహించారు.

పెన్నా నదిలో యంత్రాలతో ఇసుక తవ్వితే కేసులు: తహసీల్దార్ హెచ్చరిక



సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 12:పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేసి, యంత్రాలను సీజ్ చేస్తామని సిద్ధవటం మండల తహసీల్దార్ విజయ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం సిద్ధవటం రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పెన్నా నది నుంచి జేసీబీలు, డోజర్ల సాయంతో ఇసుక తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం గృహ అవసరాల కోసమే ఉచిత ఇసుకను వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఇసుకను కూలీలతోనే లోడింగ్ చేయాలని, యంత్రాలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ కామాక్షమ్మ

సిద్ధవటం మన జనప్రగతి అక్టోబర్ 12:-కడపచెన్నై జాతీయ రహదారిపై కనుమలోపల్లె సమీపంలోని శ్రీ కామాక్షమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం అమ్మవారు కనకదుర్గమ్మ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి విజ్ఞేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త వెంకటరమణ మాట్లాడుతూ శరన్నవరాత్రుల్లో ప్రతిరోజూ అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లోక కళ్యాణం కోసం కేరళ సిద్ధాంతులు దేవ ప్రశ్న పూజలు



పులివెందుల టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 12:- పులివెందులలోని శ్రీ రంగ నాథ ఆలయంలో సోమవారం లోక కళ్యాణం, శ్రీ రంగనాథ స్వామి ఆలయ అభివృద్ధికి కేరళ నుంచి వచ్చిన సిద్ధాంతులు డిఎస్ మహేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక వేద ప్రశ్న పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ రామ గోపాల్ రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఎమ్మెల్సీ రామ గోపాల్ రెడ్డి కార్యక్రమం చివరి వరకు పాల్గొన్నారు.సిద్ధాంతి డిఎస్ మహేంద్ర కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమానికి వచ్చిన భక్తులు, నిర్వాహకులతో మాట్లాడి వారి నుంచి ప్రశ్నల రూపంలో వివరాలను తీసుకున్నారు. వాటినీ అధ్యయనం చేసి సమాధా నాలను ఒక నివేదిక రూపంలో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి అందజేస్తానని పేర్కొన్నారు. ఈఓ రమణ, మాజీ చైర్మన్ లు పబ్బతి నారాయణ, ఒనిడా సుబ్బారెడ్డి, శ్రీ రంగనాథ ట్రస్ట్ సీఈ వో అల్లం రంగనాయకులు రాయల్ ,దినేష్ కుమార్ గుప్తా, శ్రీ చైతన్య విద్యాసంస్థల అధినేత నారాయణరెడ్డి, టిడిపి నాయ కులు జ్ఞానేశ్వర్ నాయుడు, పలువురు ప్రముఖులు భక్తులు పాల్గొన్నారు.

నిలిపివేసిన మీసేవ,ఏపీ సేవల పునరుద్ధరణకు వినతి


● ఎమ్మెల్సీ భూమి రెడ్డి రామగోపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన మీసేవ నిర్వాహకుల సంఘం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 12:మీసేవ, ఏపీ సేవ పోర్టళ్లలో నిలిపివేసిన వివిధ పౌర సేవలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ మీసేవ నిర్వాహకుల సమైక్య సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్సీ బి. రామగోపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, సేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.మీసేవ, ఏపీ సేవ పోర్టళ్లలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల రీ-ఇష్యూ, పట్టాదారు పాస్‌బుక్ రీప్రింట్, వాటర్ ట్యాక్స్ చెల్లింపులు, మున్సిపల్ పరిపాలన శాఖ పరిధిలోని జనన, మరణ ధ్రువీకరణ సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘ ప్రతినిధులు తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో స్మార్ట్‌ఫోన్లు, ఆన్‌లైన్ సేవలపై అవగాహన లేని ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించే క్రమంలో అపరిచిత ఆన్‌లైన్ లింకుల ద్వారా సైబర్ మోసాలకు గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మీసేవ కేంద్రాల్లో ఆయా సేవలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.రీ-ఇష్యూ సేవలు నిలిచిపోవడం వల్ల మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రధాన ఆదాయాన్ని కోల్పోతున్నారని, దీనిపై ఆధారపడిన వేలాది కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతోందని సంఘ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలకు సురక్షితమైన, సులభమైన సేవలు అందించడంతోపాటు మీసేవ నిర్వాహకుల ఉపాధిని కాపాడేందుకు 'మన మిత్ర'తోపాటు మీసేవ, ఏపీ సేవ పోర్టళ్లలో నిలిపివేసిన అన్ని సేవలను తిరిగి ప్రారంభించేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ గౌరవ అధ్యక్షుడు వి. అంజన్ కుమార్, జిల్లా అధ్యక్షుడు దార సునీల్, మీసేవ నిర్వాహకుడు బాబా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టీఐ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా గూడుపల్లి రాజారెడ్డి ఎంపిక

● సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తా...



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 12:- సమాచార హక్కు చట్టం2005 (ఆర్‌టీఐ) అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా గత మూడేళ్లుగా కొనసాగుతున్న గూడుపల్లి రాజారెడ్డి, తాజాగా జాతీయ స్థాయి బాధ్యతలు చేపట్టారు. భారతదేశంలోని ఆర్‌టీఐ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్ జి. శుక్లా తనను 'ఇండియా సమాచార హక్కు చట్టం2005' అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎంపిక చేసినట్లు రాజారెడ్డి తెలిపారు.తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం కోరే హక్కు ఉందని రాజారెడ్డి వివరించారు. చట్టంలోని సెక్షన్ 6(1) ప్రకారం సంబంధిత ప్రజా సమాచార అధికారికి దరఖాస్తు చేసుకోవచ్చని, సెక్షన్ 7(1) ప్రకారం సాధారణంగా 30 రోజుల్లోగా సమాచారం అందించాల్సి ఉంటుందని తెలిపారు.సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించినా, చట్టబద్ధమైన కారణం లేకుండా దరఖాస్తును తిరస్కరించినా సంబంధిత అధికారిపై చట్టప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం రోజుకు రూ.250 చొప్పున గరిష్ఠంగా రూ.25,000 వరకు జరిమానా విధించవచ్చని వివరించారు. సమాచారం అందకపోయినా, సంతృప్తికరంగా లేకపోయినా మొదటి అప్పీల్, అవసరమైతే రెండో అప్పీల్ ద్వారా న్యాయం పొందవచ్చని తెలిపారు.ప్రజలు తమకు అర్థమయ్యే స్థానిక భాషలో సమాచారాన్ని కోరవచ్చని, ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకత పెంచేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజారెడ్డి పిలుపునిచ్చారు.

ఆమె ఎప్పటికీ చిరంజీవినే... ఐడియల్ కళాశాలలో చిరంజీవిని కుమారి విగ్రహావిష్కరణ



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 12:-ఐడియల్ కళాశాల పూర్వ కరస్పాండెంట్, సామాజిక వేత్త డాక్టర్ చిరంజీవి కుమారి భౌతికంగా మరణించినా ఎప్పటికీ చిరంజీవిని గానే కళాశాలలోనూ ఆయా విద్యార్థుల్లో నిరంతరం నిలిచి ఉంటుందని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. సోమవారం విద్యుత్ నగర్లో ఉన్న ఐడియల్ కళాశాలలో చిరంజీవి కుమారి విగ్రహాన్ని గరికిపాటి నరసింహారావు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పూర్వ శాసనసభ సభాపతి, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆమె గురించి ప్రసంగించారు. కాకినాడలో ఒక మంచి భావాల ఉద్దేశంతో ఈ కళాశాల సుమారు 50 ఏళ్ల క్రితం స్థాపించారని చెప్పారు. అప్పుడు ఈ కళాశాలకు తన తండ్రి మంత్రిగా ఉండి అనుమతి ఇచ్చినట్లు గుర్తు చేసుకున్నారు. ఆమె ఆశయాలను కళాశాల యాజమాన్యం కొనసాగించాలని సూచించారు. ముఖ్యఅతిథి, విగ్రహవిష్కరణ కర్త గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ కాకినాడ, చిరంజీవిని కుమారితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని చెప్పారు. ఆమె ఏ పనినైనా సరే చాలా చాకచక్యంగా నిర్వహించి పూర్తి చేసేదన్నారు. తెలుగు భాష కళాశాలలో చేర్చారంటే ఆమె పాత్ర చాలా ఉందన్నారు. ఆమె చిరంజీవి గానే ఐడియాలు విద్యార్థుల మనస్సుల్లో ఉంటుందన్నారు. ఆమె కార్యక్రమాలను ఎటువంటి ఒత్తిడి గురు కాకుండా అనుకున్న పనులు సాధించి కాకినాడ ఐడియల్ కళాశాల విద్యార్థుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. అనంతరం గరికపాటి దంపతులను, విగ్రహ శిల్పి రాజ్ కుమార్ వడయారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, బొర్రా గోపి మూర్తి, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు), కాకినాడ నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పర్చూరు కృష్ణారావు, చిరంజీవిని కుమారి కుమారులు గోపాల్, కిరణ్, కళాశాల ఏవో జీవీకే వర్మ విద్యార్థులు, అధ్యాపక, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాను వేదికగా చేసుకొని అవాక్కులు చవాకులు

● దెబ్బకు వీడియోలు అన్ని డిలీట్ చేసావంట కదా..బయట టాక్..



గాలివీడు మన జనప్రగతి అక్టోబర్ 12:- సోషల్ మీడియాలో అకౌంట్ ఉంది కదా అని ఏది పడితే అది మాట్లాడటం.. నచ్చినట్టుగా వీడియోలు చేయడం.. వరుస పోస్టులతో హంగామా చేయడం కొంతమందికి వ్యసనంగా మారిపోయింది. నలుగురు ఫాలో అవుతున్నారని, తన వీడియోలకు వ్యూస్ వస్తున్నాయని అనుకుంటూ హద్దులు దాటి ప్రవర్తిస్తే చివరికి ఇబ్బందులు తప్పవనే చర్చ నడుస్తోంది. గత కొద్దిరోజులుగా ఓ విషయంపై సోషల్ మీడియా వేదికగా వరుస పోస్టులు పెడుతూ హడావుడి చేసిన ఓ వ్యక్తికి, ఓ నాయకుడి దగ్గర నుంచి మొట్టికాయలు పడ్డాయంటూ బయట టాక్ వినిపిస్తోంది. అయితే ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మొట్టికాయలు పడ్డాక ఆ వ్యక్తి తన వీడియోలన్నింటినీ డిలీట్ చేశారంట కదా..బయట అనుకుంటున్నారులే సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం తప్పు కాదు.. కానీ ఏది పడితే అది మాట్లాడటం, ఇతరులను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడం మాత్రం సరైన పద్ధతి కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫాలోవర్స్ ఉన్నారని విర్రవీగితే వాస్తవ పరిస్థితులు ఎదురైనప్పుడు సీన్ మారిపోతుందని నెటిజన్లు వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు.మొత్తానికి.. సోషల్ మీడియాలో హీరో అనిపించుకోవాలని చూస్తే, బయట మాత్రం విలన్ అయిపోవద్దు బాసూ!ఫోన్‌లో ఫాలోవర్స్ ఎంతమంది ఉన్నారన్నది కాదు.. మన మాటల్లో ఎంత బాధ్యత ఉందన్నదే ముఖ్యం అంటూ స్థానికులు విమర్శల వర్షం కురిపిస్తున్నారు...

జనసేన పార్టీ సమన్వయకర్తగా దాసరి రవిశంకర్

● స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యం
● పవన్ కళ్యాణ్‌కు విజయాన్ని బహుమతిగా అందిస్తాం



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 12:-జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కమిటీలను పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. రాష్ట్రంలోని 26 పార్లమెంటు, 175 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కమిటీలను ప్రకటించగా, పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్తగా దాసరి రవిశంకర్‌ను నియమించారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు దాసరి రవిశంకర్ కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో జనసేన పార్టీ పోటీ చేసే అన్ని స్థానాల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేస్తానని దాసరి రవిశంకర్ స్పష్టం చేశారు. అన్ని స్థానాల్లో విజయం సాధించి, 100 శాతం స్ట్రైక్‌రేట్‌తో ఆ గెలుపును పవన్ కళ్యాణ్‌కు బహుమతిగా అందిస్తామని దాసరి రవిశంకర్ ధీమా వ్యక్తం చేశారు.

206 మంది కళాకారులతో నృత్య నీరాజనం

- కాకినాడలో వైభవంగా దసరా నృత్య మహోత్సవ్





కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 12:-నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా నృత్య మహోత్సవ్‌శక్తి పురస్కార్2026 వేడుకలు వైభవంగా జరిగాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 206 మంది నృత్య కళాకారులు సుమారు 13 గంటల పాటు వివిధ నృత్య ప్రదర్శనలు ఇచ్చి అమ్మవారికి నృత్య నీరాజనం సమర్పించారు. పూజ్య గురువు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశక్తి పురస్కార్‌ను మునుగంటి వెంకటరావుకు, గురుశక్తి పురస్కార్‌ను నాట్యాచార్య ఆనెం ప్రసాద్‌కు, యువశక్తి పురస్కార్‌ను నాట్యాచార్య బచ్చల మల్లికార్జునరావుకు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ అర్బన్ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ నగరంలో ఇంతటి ప్రతిష్ఠాత్మక నృత్య మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. భారతీయ శాస్త్రీయ నృత్యకళల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, కళాకారులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.నృత్యాంజలి అకాడమీ డైరెక్టర్ హరి గురు శరవణ్ మాట్లాడుతూ సంగీత, నృత్య రంగాల్లో విశేష సేవలందిస్తున్న కళాకారులు, గురువులను గౌరవించడమే శక్తి పురస్కార్ ముఖ్య ఉద్దేశమన్నారు. భవిష్యత్తులో ఈ వేడుకలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు.అకాడమీ వ్యవస్థాపకులు హరి లోకేష్ శర్మ, హరి కృష్ణవేణి దంపతుల కళాసేవకు గుర్తింపుగా సంస్థ 40 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం ఈ వేడుకలకు ప్రత్యేకతను తీసుకొచ్చింది. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అతిథులు, గురువులు, కళాకారులు, తల్లిదండ్రులు, ప్రేక్షకులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

కోదండరాముడిని దర్శించుకున్న వెంకటగిరి మార్కెట్ చైర్మన్ మురుగన్

● ఆలయ శిల్పకళా వైభవంపై ప్రశంసలు



ఒంటిమిట్ట మన జనప్రగతి అక్టోబరు 12:-రెండో భద్రాద్రిగా ప్రసిద్ధిగాంచిన ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారిని సోమవారం వెంకటగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పునుగోటి విశ్వనాథం నాయుడు (మురుగన్), ఆయన సోదరుడు రిటైర్డ్ హెడ్‌మాస్టర్ పునుగోటి సుబ్రమణ్యం నాయుడు తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం మురుగన్ మాట్లాడుతూ, కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు తెలిపారు. ఒంటిమిట్ట ఆలయ పరిసరాల్లోని ఆధ్యాత్మిక వాతావరణం, అద్భుతమైన శిల్పకళా నైపుణ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయని కొనియాడారు. ఇలాంటి చారిత్రక, ఆధ్యాత్మిక క్షేత్రాన్ని దర్శించుకోవడం మరపురాని అనుభూతి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పునుగోటి సుబ్రమణ్యం నాయుడు కుటుంబ సభ్యులతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, మాజీ వార్డు సభ్యుడు సామల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పులివెందులను జల్లెడ పట్టిన ఖాకీలు: ఎన్నికల వేళ ఇల్లిల్లూ 'కార్డన్ అండ్ సెర్చ్'





పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 12:- రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల కట్టడి లక్ష్యంగా పులివెందుల నియోజకవర్గంలో పోలీసులు భారీ ఎత్తున 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ చేపట్టారు. వైఎస్సార్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు,డీఎస్పీ బి.మురళీ నాయక్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బలగాలు సోమవారం తెల్లవారుజాము నుంచే విస్తృత తనిఖీలు నిర్వహించాయి.పులివెందుల అర్బన్ పరిధిలోని భాకరాపురం,నగరిగుట్ట, వెంకటాపురం,ఎర్రగుడిపాలెం, రోటరీపురం,సియోన్‌పురంతో పాటు గ్రామీణ ప్రాంతాలైన పెద్దరంగాపురం,ఉలిమెళ్ల గ్రామాల్లో ప్రత్యేక బృందాలు ప్రతి ఇల్లూ తనిఖీ చేశాయి. అనుమానిత వ్యక్తుల వివరాలను ఆరా తీశారు.పెద్దరంగాపురం,బసిరెడ్డిపల్లి, చిన్న కొండప్ప కాలనీ, పార్నపల్లి రింగ్ రోడ్, ఆర్.వెలమవారిపల్లి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు సరైన పత్రాలు లేని వాహనాలను పరిశీలించారు. ఓటర్లు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా,ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేందుకే ఈ తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ మురళీ నాయక్ స్పష్టం చేశారు.ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఈ ఆపరేషన్‌లో పులివెందుల అర్బన్ సీఐ పురుషోత్తం రాజు,రూరల్ సీఐ శాంతిలాల్,ట్రాఫిక్ సీఐ ప్రసాదరావులతో పాటు సబ్ డివిజన్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ సమస్యను పరిశీలించిన బండి రమేష్



కూకట్ పల్లి మన జనప్రగతి అక్టోబరు 12:- గాయత్రి నగర్ డివిజన్ పరిధిలోని సర్వే నంబర్ 1007లో ఉన్న భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ భూమికి సంబంధించిన సమస్యను టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ మరియు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ పరిశీలించారు.ఈ సందర్భంగా భూ సమస్యకు సంబంధించిన వివరాలను స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నారు. సమస్యకు సంబంధించిన అంశాలపై నాయకులతో చర్చించి, స్థానికంగా నెలకొన్న పరిస్థితులను సమీక్షించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమస్య పరిష్కారానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.స్థానిక ప్రజలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బండి రమేష్ తెలిపారు. ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గాయత్రి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్తాన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వేముల సత్యం, రాఘవేంద్రరావు, కనకయ్య, విట్టల్ రెడ్డి, ఇంద్ర సింగ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు సేవా సంకల్ప్ అభియాన్

- దోమల లార్వా నివారణకు చర్యలు.. గ్రామాల్లో వైద్య శిబిరాలు



బొమ్మనహాల్, అక్టోబర్ 12 (మన జనప్రగతి): సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా దర్గా హొన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రఫియా సుల్తానా తెలిపారు. గర్భిణులు, వృద్ధులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తూ, కౌమార బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.దర్గా హొన్నూరు, బల్లనగుద్దం, కళుహోళ, వన్నెల్లి, హొసల్లి గ్రామాల్లో దోమల లార్వా నివారణకు మందులు పిచికారీ చేసి, నీటి నిల్వలను తొలగించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాకినాడ మేయర్ సీటు శెట్టిబలిజ సామాజిక వర్గానికే కేటాయించాలి

● జనసేన సీనియర్ నేత కడలి ఈశ్వరికి టికెట్ ఇవ్వాలి

● అన్ని బీసీ కులాలతో కలిసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం



కాకినాడ మన జనప్రగతి అక్టోబర్ 12:-కాకినాడ నగరం మేయర్ సీటు శెట్టిబలిజ సామాజిక వర్గానికే కేటాయించాలని జనసేన పార్టీ సీనియర్ నాయకురాలు కడలి ఈశ్వరికి ఆ మేయర్ టికెట్ ఇస్తే ఆమెను ఇతర బీసీ కులాలతో కలిసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని శెట్టిబలిజ సామాజిక వర్గ నేతలు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ కార్పొరేషన్ పరిధిలోని శెట్టిబలిజ సామాజిక వర్గ నాయకులు విలేకరులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా శెట్టిబలిజ సామాజిక వర్గ కాకినాడ నగర అధ్యక్షుడు చొల్లంగి వీరబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ ఇన్చార్జి మాజీ చైర్మన్ గుత్తుల బుల్లి రాజు, రూరల్ నాయకుడు చెల్లుబోయిన సూర్య ప్రకాశం తదితరులు మాట్లాడారు. కాకినాడ మేయర్ పీఠం బీసీ మహిళకు కేటాయించడం పట్ల కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కాకినాడ రూరల్లో సుమారు 80వేల మంది శెట్టిబలిజ సామాజిక వర్గీయులు ఉన్నారని అందువల్ల ఆ మేయర్ పీఠాన్ని శెట్టిబలిజ సామాజిక వర్గీయులకు కేటాయించాలని ప్రభుత్వ అధినేతలు కోరుతున్నామన్నారు. అలా కేటాయిస్తే కాకినాడ మేయర్ సీటును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. జనసేన పార్టీ ప్రారంభం నుంచి కడలి ఈశ్వరి ఎంతో ఉత్సాహంతో పనిచేసిందని అందువల్ల ఆమెకే ఈ సీటు కేటాయిస్తే ఘన విజయం సాధిస్తుందని వారు చెప్పారు.ఇంకా ఈ సమావేశంలో శెట్టిబలిజ సంఘం నాయకులు వాసంశెట్టి రాజేశ్వరరావు, వాసంశెట్టి త్రిమూర్తులు, బత్తుల భవాని, తుట్టా లీలావతి, గుత్తుల రమణ, దొడ్డి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు

రైతుల ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 12:-రైతుల ఐక్య పోరాటాలతోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో సోలార్ బాధిత రైతుల పంట రుణాల రెన్యువల్, రుణాలను విడతల వారీగా చెల్లించే వెసులుబాటుపై రైతు సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 30న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వద్ద ధర్నా నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ వైఖరికి నిరసనగా చేపట్టిన ఈ ఆందోళనపై స్పందించిన జిల్లా ప్రాంతీయ బ్యాంకు అధికారి రైతు సంఘం నాయకులు సిద్ధయ్య గౌడ్, మధు, రాజశేఖర్ నాయుడుతో చర్చలు జరిపారు.ఈ సందర్భంగా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రాంతీయ బ్యాంకు అధికారి హామీ ఇచ్చినట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. నోటీసులు అందుకున్న సోలార్ బాధిత రైతులకు పంట రుణాల రెన్యువల్ సదుపాయం కల్పిస్తామని, రుణాలను విడతల వారీగా చెల్లించేందుకు అవకాశం ఇస్తామని వెల్లడించారు. ఇప్పటికే ఉన్న రుణాల్లో కొంత మొత్తాన్ని చెల్లించడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకునే వెసులుబాటు కల్పిస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు.హోల్డ్‌లో ఉన్న ఖాతాల్లోనూ యథావిధిగా లావాదేవీలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తామని బ్యాంకు అధికారులు హామీ ఇచ్చినట్లు రైతు సంఘం నాయకులు వివరించారు. రైతులు, బ్యాంకులు పరస్పర సహకారంతో ముందుకు సాగితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆంజనేయులు, అశ్వత్ నాయుడు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు చోరీపై అసత్య ప్రచారం చేస్తున్నారు

- బీజేపీ స్టేట్ మీడియా ప్యానలిస్ట్ బాలకృష్ణయాదవ్



కడప మన జనప్రగతి అక్టోబర్ 12:-ఎస్ఐఆర్ (ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ) ప్రక్రియలో భాగంగా దేశంలో ఓటు చోరీ జరిగిందంటూ కాంగ్రెస్, ఇండియా కూటమి నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని బీజేపీ స్టేట్ మీడియా ప్యానలిస్ట్ బాలకృష్ణయాదవ్ ఆరోపించారు. వారు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు వాస్తవాల ఆధారంగా పరిశీలించాలని పేర్కొన్నారు.ఓటు చోరీ జరిగిందంటూ రాహుల్ గాంధీ ప్రచారం చేస్తుండగా, మరోవైపు కాంగ్రెస్ పార్టీ విదేశీ శక్తులతో కలిసి ఆందోళనలు చేస్తోందని బాలకృష్ణయాదవ్ విమర్శించారు. అక్రమ ఓట్లను తొలగించాలని సచిన్ పైలట్ వంటి కాంగ్రెస్ నేతలు చెబుతుండగా, ఓటు చోరీ ఆరోపణలకు సరైన ఆధారాలు లేవంటూ 124 మంది మాజీ బ్యూరోక్రాట్లు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ఈ పరిణామాలను బట్టి ఇండియా కూటమి ప్రచారంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.1952 నుంచి ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతోందని, ప్రస్తుతం జరుగుతున్నది ఎనిమిదో ప్రక్రియ అని బాలకృష్ణయాదవ్ వివరించారు. నాలుగు, ఐదు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ పూర్తయిందని పేర్కొంటూ, మొత్తం 95 కోట్ల ఓటర్లలో 82 కోట్ల మంది నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన 13 కోట్ల మందిలో 3.25 కోట్ల మంది మరణించినవారని, 1.15 కోట్ల మంది డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించినట్లు ఆయన వెల్లడించారు.ఓటు చోరీపై ఇండియా కూటమి చేస్తున్న ఆందోళనలకు ముగింపు పలకాలని బాలకృష్ణయాదవ్ కోరారు. ఈ సమావేశంలో కడప జిల్లాలోని ఎనిమిది మండలాలకు చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

భువన విజయ గ్రౌండ్‌లో 3,116 మందితో కుంకుమార్చన



కేపీహెచ్‌బీకాలనీ మన జనప్రగతి అక్టోబర్ 12:-ఈనెల 17న కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి ధర్మరక్షణ సేన అధ్య క్షుడు కర్రా వేణుగోపాల్ ప్రకటనలో తెలిపారు. కేపీహెచ్ బీ భువన విజయం గ్రౌండ్ లో సాయంత్రం 4.30 గంటలకు 3,116 మంది మహిళలతో ఈ కార్య క్రమం ఉంటుందన్నారు. కుంకుమ పూజలో పాల్గొనే మహిళా భక్తులకు పూజా సామగ్రి ఉచితంగా అందజేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం



కడప మన జనప్రగతి అక్టోబర్ 12:- కడప నగరంలోని అమీన్‌పీర్ రోడ్డులో ఉన్న ఆస్థాన ఏ మగ్దూమ్ ఇల్లాహి పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి ఆరిఫ్ పుల్లా సాహెబ్ తెలుగుదేశం పార్టీ కడప మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి అమీర్‌బాబు నివాసానికి వెళ్లి ఉరుసు ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ఆరిఫ్ పుల్లా సాహెబ్‌ను అమీర్‌బాబు ఘనంగా సత్కరించారు.

కడప డిఎస్పీని కలసిన దేవర కృష్ణ



కడప మన జనప్రగతి అక్టోబర్ 12:-కడప నగరానికి నూతనంగా వచ్చిన డిఎస్పి భవాని ని లోక్ సత్తా పార్టీ జిల్లా అధ్యక్షులు దేవర కృష్ణ కలసి సన్మానించి జనబలం అనే పుస్తకాన్ని బహుకరించాడు. ఈ సందర్భంగా దేవర కృష్ణ జరుగునున్న స్థానిక ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డిఎస్పీని కోరారు.తమవంతుగా ఎన్నికల్లో అన్ని విధాలైన సహాయ సహకారాలను అందజేస్తామని డిఎస్పి కి హామీ ఇచ్చారు.

మీనాక్షి దేవి అలంకారంలో వాసవి అమ్మవారు

● పులివెందులలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



పులివెందుల అర్బన్, అక్టోబర్ 12 (మన జనప్రగతి): పులివెందుల పట్టణంలోని అమ్మవారి శాలలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు మీనాక్షి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు నవీన్ శర్మ, ఓలమయ్యల ఆధ్వర్యంలో అభిషేకాలు, మహామంగళహారతి, గణపతి పూజ, ధన్వంతరి హోమం, మీనాక్షి హోమం నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో దర్శనమిస్తారని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు తెలిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

భూవివాదం కేసులో నలుగురికి మూడేళ్ల జైలు శిక్ష

● ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధించిన రాయచోటి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు ● పకడ్బందీ దర్యాప్తుతో నిందితులకు శిక్ష.. ● పోలీసు అధికారులకు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రశంసలు



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 12:- భూవివాదం నేపథ్యంలో దాడికి పాల్పడిన కేసులో నలుగురు నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,000 జరిమానా విధిస్తూ రాయచోటి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. పకడ్బందీ దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ప్రత్యేకంగా అభినందించారు.లక్కిరెడ్డిపల్లి మండలం చింతకుంటపల్లికి చెందిన నల్లతిమ్మారెడ్డిగారి చంద్రశేఖర్ రెడ్డి (63)కి, అదే గ్రామానికి చెందిన కొందరితో సర్వే నంబర్ 1178లోని భూమి విషయంలో వివాదం కొనసాగుతోంది. 2022 జనవరి 28న చంద్రశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి జేసీబీతో భూమిని చదును చేస్తుండగా, నలుగురు నిందితులు కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఫిర్యాదుదారుడితో పాటు మరికొందరికి గాయాలయ్యాయి.బాధితుడి ఫిర్యాదుతో లక్కిరెడ్డిపల్లి పోలీసులు క్రైమ్ నంబర్ 10/2022 కింద ఐపీసీ సెక్షన్లు 323, 324, 307, 34 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఎస్సీ నంబర్ 226/2022గా విచారణకు వచ్చిన కేసులో న్యాయమూర్తి డాక్టర్ ఇ. ప్రసూన విచారణ చేపట్టగా, ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. గుర్రప్ప వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నలుగురికి కోర్టు శిక్ష విధించింది.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని దాడులకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి స్పష్టం చేశారు. కోర్టు మానిటరింగ్ సిస్టం (సీఎంఎస్) ద్వారా కేసుల పురోగతిని పర్యవేక్షించడం, సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరుపరచడం వల్ల నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ కేసులో సమన్వయంతో పనిచేసిన రాయచోటి డీఎస్పీ ఎం.ఆర్. కృష్ణమోహన్, లక్కిరెడ్డిపల్లి సీఐ హెచ్. కృష్ణంరాజు నాయక్, అప్పటి ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్, ప్రస్తుత ఎస్ఐ జి. శోభ, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. గుర్రప్ప, కోర్టు కానిస్టేబుల్ సి. గంగాధర్, కోర్టు లైజన్ అధికారి వి. మస్తాన్ వలిని ఎస్పీ అభినందించారు.

రాయచోటి కోర్టు భవనాలకు తక్షణమే మరమ్మతులు చేయించండి

● కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తికి రాయచోటి న్యాయవాదుల విజ్ఞప్తి

● మరమ్మతులు చేపడతామని హామీ ఇచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



రాయచోటి మన జనప్రగతి అక్టోబర్ 12:- రాయచోటిలో 1984లో నిర్మించిన కోర్టు భవనాలకు తక్షణమే మరమ్మతులు చేయించి, తిరిగి అదే భవనాల్లో కోర్టుల నిర్వహణ కొనసాగించాలని రాయచోటి బార్ అసోసియేషన్ సభ్యులు కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్. రామ్ గోపాల్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు.కోర్టు భవనాలకు చిన్నపాటి మరమ్మతులు అవసరం కావడంతో 2023 నుంచి అద్దె భవనాల్లో కోర్టులు నిర్వహిస్తున్నారని న్యాయవాదులు తెలిపారు. గత మూడేళ్లుగా మరమ్మతులపై తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొంటూ, భవనాలకు వెంటనే మరమ్మతులు చేపట్టి కోర్టులను తిరిగి పాత భవనాల్లోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.ఇటీవల బాధ్యతలు చేపట్టిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆర్. రామ్ గోపాల్ ఈ నెల 5న రాయచోటిని సందర్శించి కోర్టు భవనాల పరిస్థితిని పరిశీలించారు. చిన్నపాటి మరమ్మతులు చేపట్టేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని అప్పట్లో న్యాయవాదులకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో న్యాయవాదులు సోమవారం మరోసారి ఆయనను కలిసి తమ విజ్ఞప్తిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. రెడ్డి భాషా, ఉపాధ్యక్షురాలు ఎస్. లక్ష్మీదేవి, జాయింట్ సెక్రటరీ వి. సిద్ధయ్య, ట్రెజరర్ కృష్ణమా, స్పోర్ట్స్ సెక్రటరీ టి.వి. రమణ, మాజీ అధ్యక్షులు కె. నాగిరెడ్డి, ఎన్. ప్రభాకర్ రెడ్డితో పాటు సీనియర్ న్యాయవాదులు ధనుంజయ్ కుమార్, ఆనంద్ కుమార్ రెడ్డి, కుమార్, నాగేశ్వర్, టి. ఈశ్వర్, హుమయూన్ భాషా, ఎం. రవిశంకర్, ఎం. ఖాదర్ బాషా, వరలక్ష్మి, శివమ్మ, జగదీష్, శివకుమార్, ఉత్తేజ్ కుమార్, హరీష్, కిరణ్ కుమార్, ఇర్షాద్, నాగేంద్ర, ఎస్.పి.ఆర్. నాగరాజు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారుల భద్రతే ముఖ్యం

- బైపాస్ రోడ్డు గుంతను పూడ్పించిన సీఐ ప్రసాదరావు





పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 12:వాహన చోదకుల భద్రతను దృష్టిలో ఉంచుకొని పులివెందుల బైపాస్ రోడ్డులో ప్రమాదకరంగా మారిన గుంతను ట్రాఫిక్ పోలీసులు స్వయంగా పూడ్చివేశారు. పులివెందుల డీఎస్పీ మురళి ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు ఈ మరమ్మతు పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. పులివెందుల టౌన్ పరిధిలోని పార్ధపల్లి రింగ్ రోడ్డు నుండి ముద్దనూరు రింగ్ రోడ్డు వైపు వెళ్లే బైపాస్ రోడ్డులో,రాజారెడ్డి కాలనీ మలుపు వద్ద ఇటీవల భారీ గుంత ఏర్పడింది.దీనివల్ల నిత్యం వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంది.దీంతో వెంటనే స్పందించిన సీఐ ప్రసాదరావు,జేసీబీ సహాయంతో మట్టిని తెప్పించి ఆ గుంతను పూడ్చివేయించారు.ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా రాకపోకలను పునరుద్ధరించారు.ఈ సందర్భంగా సీఐ ప్రసాదరావు మాట్లాడుతూ పులివెందుల పట్టణ పరిధిలోని రహదారుల మరమ్మతుల దృష్ట్యా వాహనదారులు అప్రమత్తంగా తగిన జాగ్రత్తలతో ప్రయాణించాలని సూచించారు.అలాగే ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని,ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆయన స్పష్టం చేశారు. పోలీసుల ఈ ముందస్తు చర్యను స్థానిక ప్రజలు, వాహనదారులు అభినందించారు.

రాజంపేట జనసేన కోఆర్డినేటర్లుగా ఎల్లటూరు బ్రదర్స్ సేవలు అభినందనీయం

● ప్రజా సమస్యల పరిష్కారంలో శ్రీనివాసరాజు ముందంజ: కొమరా వెంకట నరసయ్య



ఒంటిమిట్ట మన జనప్రగతి అక్టోబరు 12:-జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా ఎల్లటూరు శ్రీనివాసరాజు, అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా ఎల్లటూరు శివరామరాజు నియామకం పట్ల ఒంటిమిట్టకు చెందిన టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ రాష్ట్ర డైరెక్టర్ కొమరా వెంకట నరసయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం రాజంపేటలోని ఎల్లటూరు భవన్‌లో నిర్వహించిన ఎల్లటూరు బ్రదర్స్ అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఉన్నత ఉద్యోగాన్ని వదులుకుని జనసేన పార్టీలో చేరిన శ్రీనివాసరాజు ప్రజాసేవకు ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల మారుమూల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారని, సిద్ధవటం మండలం కడపాయపల్లె గ్రామానికి సిమెంట్ రోడ్డు నిర్మించడంతో పాటు కొండ ప్రాంత గ్రామాలకు రహదారి సదుపాయాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంత యువత, మహిళల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ, ప్రజాసేవలో ఎల్లటూరు బ్రదర్స్ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్లటూరు శ్రీనివాసరాజు, శివరామరాజులను శాలువాలు, గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు

- రూ.65 లక్షలతో నూతన కల్వర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన



కడప మన జనప్రగతి అక్టోబర్ 12:-నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ ఆర్. శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప నగరపాలక సంస్థ పరిధిలోని 40వ డివిజన్ మరియాపురం, బిల్డప్ సర్కిల్ సమీపంలోని సిమ్లా ఫంక్షన్ హాల్ ఎదుట 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న నూతన కల్వర్ట్ నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేసి, భూమిపూజ నిర్వహించారు.స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కల్వర్ట్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ మోహన్ రెడ్డి, నాయకులు కర్నాటి ఓబుల్ రెడ్డి, లోమడ చంద్రమోహన్ రెడ్డి, రెడ్డయ్య యాదవ్, శిలాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, నగరపాలక సంస్థ అధికారులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల ఓటు హక్కుపై దాడి అప్రజాస్వామికం

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి శాలెం రాజు మాదిగ

● ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి..

● కలెక్టరేట్‌కు ఎమ్మార్పీఎస్ నేతల వినతి



పత్తికొండ మన జనప్రగతి అక్టోబర్ 12:- ప్రజల ప్రాథమిక ఓటు హక్కును కాపాడాలని, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి శాలెం రాజు మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలో ఆదివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా కన్వీనర్ గంజహళ్లి పసెద్దుల మహదేవ్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి శాలెం రాజు మాదిగ, జాతీయ ప్రధాన కార్యదర్శి రాం కొండ వెంకటేశ్వర్లు మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత పాత బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా పానుగంటి శాలెం రాజు మాదిగ మాట్లాడుతూ, స్వయం ప్రతిపత్తి కలిగిన ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుందని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో 13 కోట్ల మందికి పైగా ఓటర్లను తొలగించారని పేర్కొంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పౌరుల ప్రాథమిక ఓటు హక్కుపై దాడి అని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా సంస్కరణలు చేపట్టాలని, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, ఓటు హక్కు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి.జి.ఆర్.ఎస్)లో ఎమ్మార్పీఎస్ ప్రతినిధి బృందం జిల్లా జాయింట్ కలెక్టర్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బురుజుల పులికొండ మాదిగ, రాష్ట్ర కార్యదర్శి జి. ఆనంద్ చైతన్య మాదిగ, నంద్యాల జిల్లా కన్వీనర్ కె. రాజు మాదిగ, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నంపల్లి కె. శ్రీనివాసులు మాదిగ, జిల్లా నాయకులు చందోలి ఎం. ప్రసాద్ మాదిగతో పాటు వివిధ మండలాల నాయకులు డోన్ రామాంజనేయులు మాదిగ, నాగరాజు మాదిగ, దేవనకొండ రామాంజనేయులు మాదిగ, గంజహళ్లి గిద్యోను మాదిగ, హెచ్. కైరవాడి నాగరాజు మాదిగ, గుల్లమరుసు ఇమ్మానియేలు మాదిగ, పెద్దమర్రివీడు రాజు మాదిగ, గాజులదిన్నె హరిబాబు మాదిగ, సంసోను మాదిగ పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

బొమ్మనహల్ మన జనప్రగతి అక్టోబర్ 12:-బొమ్మనహల్ మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై నేడు ఉదయం 10 గంటలకు బొమ్మనహల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అన్ని గ్రామంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత ఉపాధి హామీ సిబ్బంది అధికారులు సకాలంలో హాజరై ప్రజావేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు కోరారు, మండల ఎంపిడిఓ విజయభాస్కర్,ఏపీఓ. లక్ష్మీకాంత బాయ్,కోరారు.

టిడిపి కార్యకర్తలను కలిసిన మారెడ్డి లతా రెడ్డి



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 12:-పులివెందుల టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి సతీమణి, పులివెందుల మాజీ జెడ్పిటిసి సభ్యురాలు మారెడ్డి లతా రెడ్డి సోమవారం వేంపల్లికి వచ్చారు. చక్రాయపేట మండలం అద్దాలమర్రి గ్రామానికి చెంది వేంపల్లెలో నూతనంగా నిర్మించుకున్న తెదేపా నేత గంగాధర్ గృహప్రవేశ వేడుకకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ కుటుంబ సభ్యులను ఆమె ఆత్మీయంగా పలకరించి, నూతన గృహంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెదేపా కార్యకర్తలను ఆమె కలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ ఇన్‌ఛార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి, వేంపల్లె టీడీపీ మండల అధ్యక్షుడు మునిరెడ్డి, జిల్లా తెదేపా మాజీ కార్యదర్శి పొట్టి పాటి మోహన్ రెడ్డి చక్రాయపేట మండల టీడీపీ నాయకులు లోమడ భాస్కర్ రెడ్డి, ఎద్దుల చంద్ర, గండి దేవస్థానం చైర్మన్ కల్లూరి వెంకటస్వామి పాల్గొన్నారు.

తాతిరెడ్డిపల్లెలో విద్యుత్ ఘాతంతో రైతు మృతి



లింగాల మనజనప్రగతి అక్టోబర్ 12:- లింగాలలోని తాతిరెడ్డిపల్లె గ్రామంలో సోమవారము విద్యుత్ ఘాతం సంభవించి తోటా రమణారెడ్డి(55) అనే రైతు మృతి చెందాడు. వివరాలకు వెళితే రైతు రమణారెడ్డి సాయంత్రం తన పొలంలోని అరటి పంటకు డ్రిప్పు ఎరువులు ఎక్కించేందుకు పొలం వద్దకు వెళ్లాడు . డ్రిప్పు ఎరువులను మోటార్ సాయంతో ఎక్కిస్తుండగా మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లి ట్రాక్టర్ వద్ద ఉన్న వైర్లను ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య కళావతి, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి విషయం పోలీసులకు గ్రామ ప్రజలు తెలుపగా అక్కడికి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి సిబ్బందితో వెళ్లి పరిశీలించారు ఆయన కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైతు రమణారెడ్డి ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

మదనపల్లి, మన జనప్రగతి, అక్టోబర్ 12:- ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా అందిన అర్జీలను గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జేసీ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో ఏ. వెంకటేష్ తదితర అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారంలో జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని జేసీ సూచించారు. ప్రజల నుంచి సేకరించే ఐవీఆర్ఎస్ అభిప్రాయాల్లో సానుకూల ఫలితాలు సాధించేలా శాఖల అధికారులు పనితీరు మెరుగుపరచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో వృద్ధాప్య, వికలాంగుల పింఛన్లు, వితంతు పింఛను, ఆలయ పూజారికి ధూపదీప నైవేద్య పథకం కింద గౌరవ భృతి తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.మొత్తం 433 అర్జీలు అందగా, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ సూచనలు జారీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీ4 విధానంలో బీసీ యువతకు ఉచిత సివిల్స్ కోచింగ్

● త్వరలో డీఎస్సీ సహా ఇతర పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



అమరావతి, మన జనప్రగతి అక్టోబర్ 12:- పీ4 విధానంలో బీసీ నిరుద్యోగ యువతకు ఉచిత సివిల్ సర్వీసెస్ శిక్షణ అందించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. ఇందుకోసం డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ, బీసీ సంక్షేమ శాఖ మధ్య ఒప్పందం కుదిరింది. మంత్రి సమక్షంలో ఇరువర్గాల ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు.ఈ కార్యక్రమం ద్వారా ఏటా 100 మంది బీసీ అభ్యర్థులకు నిపుణులైన అధ్యాపకులతో శిక్షణ, ఉచిత స్టడీ మెటీరియల్, వసతి కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు లక్ష్యానికి అనుగుణంగా బీసీ యువత ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.గత రెండేళ్లలో 200 మందికి ఉచిత సివిల్స్ శిక్షణ అందించినట్లు మంత్రి పేర్కొన్నారు. త్వరలో సివిల్స్ కోచింగ్ ప్రారంభించడంతో పాటు, డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. గ్రూప్-1, ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు కూడా బీసీ స్టడీ సర్కిళ్ల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు మాట్లాడుతూ, సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన బీసీ అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున వ్యక్తిగత ఆర్థిక సహాయం అందించనున్నట్లు ప్రకటించారు.కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, డాక్టర్ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


తిరుపతిలో రూ.106 కోట్లతో అభివృద్ధి పనులు

- మౌలిక సదుపాయాలతో నగర రూపురేఖల్లో మార్పు: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి, అక్టోబర్ 12 (మన జనప్రగతి): తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) పథకం కింద రూ.106 కోట్లతో రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, డివైడర్లు, పార్కుల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గొల్లవాణిగుంట పరిధిలోని శ్రీనివాస నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి నగరపాలక సంస్థ కమిషనర్ జయకృష్ణతో కలిసి ఆయన భూమిపూజ చేశారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు, పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థకు 39 వినతులు



తిరుపతి మన జనప్రగతి అక్టోబర్ 12:- నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని రెవిన్యూ అధికారి రవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 13 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 26 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. సుబ్బారెడ్డి నగర్ నందు అనుమతులు లేకుండా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు పరిశీలించాలని, నెహ్రూ నగర్లో ఇండ్ల మధ్యలో చెత్త వేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ గృహాల కొరకు కట్టిన నగదు తిరిగి ఇప్పించాలని, శ్రీ నగర్ కాలనీలో తెలుగుగంగ నీరు సక్రమంగా రావడం లేదని, ఆర్.కె.పురంలో కాల్వలు శుభ్రం చేయడం లేదని, బొమ్మగుంట, నారాయణ పురంలో కాలువలు, రోడ్లు పాడైపోయాయి మరమ్మత్తులు చేయించాలని, తాతయ్యగుంటలో డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని, సుందరయ్య నగర్ దోభీ ఘాట్ ను మరమ్మత్తులు చేయించాలని, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలు

మదనపల్లి, మన జనప్రగతి, అక్టోబర్ 12: అన్నమయ్య జిల్లాలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ పథకంపై ప్రచార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు.జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో ప్రచారం నిర్వహిస్తామని, అర్హత, ఆసక్తి ఉన్న రైతులు సమీప రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిన్న, సన్నకారు రైతులు, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ పథకం ద్వారా ఉద్యాన పంటల విస్తరణ, సూక్ష్మ సేద్యం, పంటల ఉత్పాదకత పెంపు, వ్యవసాయ యాంత్రీకరణ, నాణ్యమైన మొక్కల సరఫరా, కోత అనంతర నిర్వహణ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, విలువ జోడింపు తదితర అంశాల్లో రైతులకు ప్రోత్సాహం అందించనున్నారు. రైతులకు పథక ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

ఏపీని ప్రధాన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతాం

పర్యాటక రంగంలో పెట్టుబడులకు విస్తృత అవకాశాలు: మంత్రి కందుల దుర్గేష్



కాకినాడ, అక్టోబర్ 12 (మన జనప్రగతి): ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన 31వ సీఐఐ ప్రాంతీయ సదస్సులో మాట్లాడుతూ, పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పర్యాటక విధానం 202429 ద్వారా పెట్టుబడులను ప్రోత్సహిస్తూ, భూమి కేటాయింపు, అనుమతులు, రాయితీలను సులభతరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని 1,053 కిలోమీటర్ల తీరప్రాంతంలో హోటళ్లు, రిసార్టులు, వెల్‌నెస్ కేంద్రాలు, క్యారవాన్, హోమ్‌స్టే, ఎకో, అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పా రు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగ నున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ప్రాంతీయ సదస్సు లు సన్నా హకంగా ఉపయోగపడతాయని వివరించారు. ఎంపీ లు,మంత్రులు,సీఐఐ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

కడప రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్లు ప్రారంభం



కడప,టౌన్ మన జనప్రగతి అక్టోబర్ 12:- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే ఉద్దేశంతో బిపిటి మరియు కేఎన్ఎమ్ రైస్ విక్రయాలను చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా కడప రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, ప్రజలకు బిపిటి బియ్యం కిలో ₹49/- మరియు కేఎన్ఎమ్ / ఆర్యన్ఆర్ బియ్యం కిలో ₹0/- ధరలకు విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. కడప రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక కౌంటర్లను జిల్లా సరఫరా అధికారి, వైయస్సార్ జిల్లా, జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్, వైయస్సార్ జిల్లా, రెవెన్యూ డివిజనల్ అధికారి, కడప, మరియు తహసీల్దార్, కడప వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు నాణ్యమైన బిపిటి మరియు కేఎన్ఎమ్ బియ్యం ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కడప రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యాన్ని కొనుగోలు చేసుకోవాలని సూచించారు. బియ్యం విక్రయాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని పేర్కొన్నారు.

రహదారుల పనులను వేగవంతం చేయాలి

● గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం

● రూ.300 కోట్లతో పుష్కరాల పనులు

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.174 కోట్లు



కాకినాడ, మన జనప్రగతి, అక్టోబర్ 12:- జిల్లాలో రహదారుల అభివృద్ధి, మరమ్మతుల పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కరాలకు సంబంధించిన అభివృద్ధి పనులను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.సోమవారం కాకినాడ జిల్లాకు చెందిన ఆర్ అండ్ బి శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రహదారుల పనుల పురోగతి, నిధుల వినియోగం, భూసేకరణ సమస్యలపై మంత్రి సమీక్షించారు. గోదావరి పుష్కరాల అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.300 కోట్లు కేటాయించగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు రూ.174 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.నిధుల విడుదల నేపథ్యంలో ఎన్‌డీబీ, ఏడీబీ, సీఆర్ఐఎఫ్ నిధులతో చేపడుతున్న రహదారి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రహదారుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణ సమస్యలను టాస్క్‌ఫోర్స్ కమిటీ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.శిథిలావస్థలో ఉన్న ఆర్ అండ్ బి కార్యాలయాలను పునరుద్ధరించడంతో పాటు, బ్రిడ్జి డిజైన్ల విభాగంలో సిబ్బంది కొరతను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. శాఖలో సచివాలయ సిబ్బంది వినియోగానికి సంబంధించిన సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారిస్తామని తెలిపారు.

వెంకన్న అన్నదానానికి రూ.1,02,116 విరాళం



గుడివాడ, అక్టోబర్ 12 (మన జనప్రగతి): పాటిమీద జగన్నాథపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్న సమారాధనకు వీర్ల సాయి శివ, వెంకట శ్రావణి లక్ష్మి దంపతులు రూ.92 వేలు, వారి కుమారుడు జష్ణు కార్తికేయ పేరుపై రూ.10,116 కలిపి మొత్తం రూ.1,02,116 విరాళంగా అందించారు. ఆలయ చైర్మన్ లింగం శివరామ ప్రసాద్, ధర్మకర్తల సమక్షంలో విరాళం అందజేశారు. అర్చకులు వేదాంతం అప్పలచార్యులు దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందించారు.

మున్సిపల్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశాలు



కడప,టౌన్ మన జనప్రగతి, అక్టోబర్ 12:- త్వరలో నోటిఫికేషన్ వెలువడనున్న మున్సిపల్ ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, డీఆర్వో కె. మల్లికార్జునుడుతో కలిసి మున్సిపల్ కమిషనర్లు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల విధుల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓటరు జాబితాల ప్రచురణ, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, బ్యాలెట్ పత్రాల ముద్రణ, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ వంటి పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలు, స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రవాణా సదుపాయాల ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలన్నారు.మున్సిపల్ ఎన్నికలతో పాటు గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు కూడా అవసరమైన సన్నద్ధత చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.

కడప కార్పొరేషన్‌లో బీసీ స్థానాల కేటాయింపుపై విచారణ జరపాలి

● రాబోయే ఎన్నికల్లో బీసీ స్థానాలను బీసీలకే కేటాయించాలి

● బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్



కడప,టౌన్ మన జనప్రగతి, అక్టోబర్ 12:- కడప నగర కార్పొరేషన్‌లో గత ఎన్నికల సందర్భంగా బీసీలకు చెందిన 11 స్థానాలను మైనారిటీలకు కేటాయించారని ఆరోపిస్తూ, దీనిపై విచారణ జరపాలని బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ నాయకులు డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల స్థానాలను బీసీలకే కేటాయించాలని కోరారు.ఈ మేరకు కడప కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో డీఆర్వో మల్లికార్జునకు నాయకులు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2007లో జారీ చేసిన జీవో నంబర్ 23లో మైనారిటీలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించారని, రాజకీయ రిజర్వేషన్ల ప్రస్తావన లేదని పేర్కొన్నారు. అయినప్పటికీ గత ఎన్నికల్లో బీసీ స్థానాలను మైనారిటీలకు ఎలా కేటాయించారో విచారించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా నిబంధనల ప్రకారం స్థానాల కేటాయింపు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు తిప్పిరెడ్డిపల్లి నాగేశ్వరరావు, జనతాదళ్ (ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వై.ఎం. ప్రతాప్‌రెడ్డి, ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ఎం. ఓబులేసు యాదవ్, గున్న జయరాం, ఎస్.వి. రమణ, ఓబులుగారి కేశవులు తదితరులు పాల్గొన్నారు

స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండండి

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



వేంపల్లె మన జనప్రగతి అక్టోబర్ 12:-స్థానిక సంస్థల ఎన్నికలల్లో పోటీలకు సిద్ధంగా ఉండండి.. మీకు జగనన్న, సతీష్ రెడ్డి, నేను అండగా ఉంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చక్రాయపేట మండల వైకాపా నేతలకు భరోసానిచ్చారు. వేంపల్లి మండలంలోని ఇడుపులపాయ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం చక్రాయపేట మండలం వైకాపా నేతలతో ఎంపీ అవినాష్ రెడ్డి, వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగారెడ్డి సతీష్ రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలలో తలపడేందుకు నాయకులు, కార్యకర్తలతో వారు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు తాము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారని, అప్పట్లో ఎక్కడ కూడా ఎవర్ని బలవంతంగా నామినేషన్లు విత్ డ్రా చేయడం కానీ దౌర్జన్యాలు చేయలేదని ఎంపీ పేర్కొన్నారు. ఈ దఫా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో పార్టీ ఇన్చార్జిలు వైకాపా తరపున అభ్యర్థులను నిలపాలని లేకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వమని వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రకటించడం వల్ల అన్నిచోట్ల ఈ పర్యాయం వైకాపా శ్రేణులు పోటీకి సిద్ధమవుతున్నారన్నారు. పులివెందుల నియోజకవర్గంలో వైకాపాకు 75 శాతానికి పైగా ఓట్లు ఉన్నాయని ఇక్కడ ఎలాగైనా మీరు పోటీకి దిగాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇక్కడ ఎవ్వరూ ఎవరికీ భయపడరాదని తప్పనిసరిగా పోటీకి దిగాలన్నారు. పోటీకి దిగిన నాయకులకు తాము అండగా నిలుస్తామని ఎంపీ పేర్కొన్నారు. బైండోవర్ కేసులకు పిలిచినప్పుడు మాత్రమే పోలీస్ స్టేషన్కు వెళ్లాలని, ఇతర ఏ ఒత్తిళ్లకు ఎవరూ భయపడరాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేవారు.. కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇతరత్రా వాటిని ఇప్పటినుంచే సిద్ధం చేసుకోవాలని ఎంపీ సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని అందరూ పోటీకి సిద్ధం కావాలని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి చక్రాయపేట పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. చక్రాయపేట మండల వైకాపా కన్వీనర్ బెల్లం ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీలు బాలకృష్ణ యాదవ్ రుక్మాంగద రెడ్డి, మాజీ ఎంపీటీసీ బొందల కుంట ఈశ్వర్ రెడ్డి ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారంలో దూసుకుపోతున్న తూగుట్ల మధు

- జండా మాను వీధిలో బ్రహ్మరథం పట్టిన స్థానికులు
- పదవులు ఉన్నా లేకున్నా ప్రజల మనిషేనంటున్న జనం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 12:పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో స్థానిక ఎన్నికల జోరు ఊపందుకుంది.తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికల బరిలో ఉన్న ప్రముఖ నేత తూగుట్ల మధుసూదన్ రెడ్డి చేపట్టిన ఇంటింటా ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.తాజాగా జండా మాను వీధిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు.పదవులు ఉన్నా లేకున్నా నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తూ,తమ కష్టసుఖాల్లో అండగా ఉండే నాయకుడిగా తూగుట్ల మధుకు మంచి గుర్తింపు ఉందని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు.గతంలో 2013 మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ కంచుకోటగా భావించే సమయంలోనే 3వ వార్డు నుంచి కౌన్సిలర్గా గెలుపొంది తన సత్తా చాటారని.రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ ఆయన విజయం ఖాయమని టీడీపీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.పోటీలో ఎవరొచ్చినా తగ్గేదే లేదని కూటమి పార్టీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

పులివెందుల మున్సిపల్ రిజర్వేషన్‌పై ముందే వార్త ఇచ్చిన 'మన జనప్రగతి'

- మహిళా జనరల్ రిజర్వేషన్‌ను ముందుగానే పాఠకులకు తెలియజేసిన మన జనప్రగతి'



పులివెందుల, మన జనప్రగతి అక్టోబర్ 12:- రాబోయే మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పులివెందుల మున్సిపాలిటీ రిజర్వేషన్‌పై ముందుగానే వార్తను ప్రచురించి పాఠకులకు సమాచారాన్ని అందించిన మన జనప్రగతి తెలుగు దినపత్రిక మరోసారి వార్తా రంగంలో తన ప్రత్యేకతను చాటుకుంది. పులివెందుల మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవి మహిళా జనరల్‌కు కేటాయించబడుతుందని ముందుగానే పాఠకులకు తెలియజేయడం స్థానికంగా ఆసక్తికరంగా మారింది.మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది. రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక, రాజకీయ పార్టీల వ్యూహాలపై ప్రజల్లో చర్చ సాగుతోంది. ఈ క్రమంలో పులివెందుల మున్సిపాలిటీ రిజర్వేషన్‌కు సంబంధించి మహిళా జనరల్ అంశాన్ని ముందుగానే వెలుగులోకి తీసుకురావడం ద్వారా మన జనప్రగతి పాఠకులకు ఎన్నికల పరిణామాలపై అవగాహన కల్పించింది.స్థానికంగా జరిగే రాజకీయ, సామాజిక పరిణామాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకురావడంలో ప్రాంతీయ పత్రికల పాత్ర కీలకం. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల వంటి ప్రజాస్వామ్య ప్రక్రియల్లో రిజర్వేషన్ల వివరాలు రాజకీయ పార్టీలతో పాటు ఆశావహ అభ్యర్థులకు కూడా ప్రాధాన్యత కలిగిన అంశం. ఈ నేపథ్యంలో రిజర్వేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే ప్రచురించడం పాఠకుల్లో చర్చకు దారితీసింది. వార్తలను ప్రజలకు చేరవేయడమే కాకుండా, స్థానికంగా ప్రాధాన్యత కలిగిన అంశాలపై ముందస్తు సమాచారాన్ని అందించడమే లక్ష్యంగా మన జనప్రగతి తెలుగు దినపత్రిక ముందుకు సాగుతోంది. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని అందిస్తూ, నిష్పాక్షికమైన వార్తా కథనాల ద్వారా పాఠకుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ పత్రిక లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొనవచ్చు.

ప్రజా ఫిర్యాదులను బాధ్యతాయుతంగా పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



కడప, మన జనప్రగతి, అక్టోబర్ 12:- ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనాతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవాలను తెలుసుకుని సరైన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. పొంతనలేని నివేదికలు సమర్పించరాదని స్పష్టం చేశారు.భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ క్లినిక్‌ల సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు. అర్జీదారుల సంతృప్తికి ప్రాధాన్యమిస్తూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి అవసరమైన కార్యక్రమాలను ముందుగానే గుర్తించి చర్యలు చేపట్టాలన్నారు.కార్యక్రమంలో డీఆర్వో మల్లికార్జునుడు, డిప్యూటీ కలెక్టర్లు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి. రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాధాన్యతే లక్ష్యం

కాకినాడలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



కాకినాడ, అక్టోబర్ 12 (మన జనప్రగతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 40 శాతానికి పైగా రాజకీయ ప్రాధాన్యత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. సోమవారం కాకినాడలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో వైఎస్సార్సీపీ అడ్డంకులు సృష్టిస్తోందని ఆరోపించారు. న్యాయస్థానాల తీర్పులకు అనుగుణంగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, జాతీయ రహదారుల కోసం సుమారు రూ.లక్ష కోట్ల ప్రతిపాదనలు ఉన్నాయని వెల్లడించారు. జలజీవన్ మిషన్ 2.0 కింద రూ.30,136 కోట్లతో 50,315 పనులు చేపట్టి, 27.36 లక్షల గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అమరావతి, పోలవరం పనులను వేగవంతం చేస్తున్నామని, 2027 గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరేంద్రనాథ్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న వైయస్సార్సీపీ

- నారాయణ కాలేజ్ రోడ్,ఆర్డీవో కార్యాలయం పరిసరాల్లో మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి విస్తృత ప్రచారం
- ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న నేతలు



పులివెందుల అర్బన్ మన జనప్రగతి అక్టోబర్ 12: 'మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విస్తృతంగా పర్యటిస్తున్నాయి.ఇందులో భాగంగా మున్సిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు నారాయణ కాలేజ్ రోడ్ మరియు ఆర్డీవో కార్యాలయం ఎదురు వీధుల్లో ముమ్మర ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వైయస్ మనోహర్ రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ప్రజలతో మమేకమయ్యారు.కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను,క్షేత్రస్థాయి అవసరాలను అడిగి తెలుసుకున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన, జరగబోయే అభివృద్ధి పనులను వివరిస్తూ, రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు.పర్యటన సాగిన వీధుల్లో స్థానిక ప్రజలు,మహిళలు వైయస్ మనోహర్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు.ప్రజల నుంచి లభిస్తున్న స్పందన చూస్తుంటే వైయస్సార్సీపీ అభ్యర్థుల విజయం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు,వార్డు సమన్వయకర్తలు, కార్యకర్తలు,స్థానిక యువకులు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా: మంత్రి నారాయణ

- పీఎం స్వనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



నెల్లూరు, మన జనప్రగతి, అక్టోబర్ 12: వీధి వ్యాపారులు ఆర్థికంగా ఎదిగి స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరంలోని బార్కాస్ సెంటర్‌లో నిర్వహించిన పీఎం స్వనిధి 2.0 కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యాపారులకు రుణ చెక్కులు, క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు.పీఎం స్వనిధి పథకం ద్వారా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో రూ.20.46 కోట్ల ఆర్థిక సహాయం అందినట్లు మంత్రి తెలిపారు. వ్యాపారులు ఈ నిధులను సద్వినియోగం చేసుకుని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవాలని, రుణాలను సకాలంలో చెల్లించి మరింత ఆర్థిక సహాయం పొందే అవకాశాలను పెంచుకోవాలని సూచించారు. పేద కుటుంబాల ఆదాయం పెరిగి, జీవన ప్రమాణాలు మెరుగుపడినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన అభివృద్ధి పనులను కూటమి ప్రభుత్వం తిరిగి ప్రారంభించి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. పేదల సంక్షేమం, విద్యా సంస్థల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. కార్యక్రమంలో నెల్లూరు మేయర్ దేవరకొండ సుజాత, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, టౌన్ డీఎస్పీ దీక్ష, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, కార్పొరేటర్లు, బ్యాంకు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174